ప్రజాశక్తి
బుధవారం 10 ఏప్రిల్ 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు

ఉత్తుత్తిగా నిధుల విడుదల

- మూడు పథకాల్లో సొమ్ము రాక మహిళల నిరాశ
- సిఎం బటన్ నొక్కినా అందని ఆర్థిక సాయం
- విద్యాదీవెన, చేయూత, ఈబిసి నేస్తం లబ్ధిదారుల నిట్టూర్పు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం మార్చి ఒకటో తేదీ నుంచి విడుదల చేసిన మూడు పథకాలకు సంబంధించిన నిధులు విడుదల కాక మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు. తిరిగి తిరిగి విసిగి వేసారి ఎన్నికలు రావడం వల్ల ఇక నిధుల రావని అధికారులు తాపీగా చెబుతుండంతో తీవ్ర నిరాశతో ఇంటిముఖం పడుతున్నారు.

నవరత్నాలలో భాగంగా సిఎం జగన్ మార్చి ఒకటిన పామర్రులో జగనన్న విద్యా దీవెన నిధులను బటన్ నొక్కి విద్యార్థి, తల్లి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లాలో 37,064 మందికి రూ.31.28 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు అదేరోజు ఃచెక్కులు విడుదల చేశారు. కానీ ఇంత వరకు నిధులు రాలేదు. దీంతో విద్యా దీవెన ద్వారా సొమ్ము రాకపోవడంతో విద్యార్థులను ఆయా విద్యా సంస్థల నిర్వహాకులు ఫీజు చెల్లించాలని వత్తిడి చేస్తున్నారు. విద్యార్థి, అతని తల్లితో ఇటీవల జాయింట్ ఖాతాను ప్రారంభింప చేసిన ప్రభుత్వం అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక నిధులను పలు మార్లు వాయిదా వేసి మార్చి ఒకటిన విడుదల చేశారు. కానీ జిల్లాలో సగం మందికి పైగా నిధుల రాకపోవడంతో

లబ్ధిదార్లకు మెగా చెక్కును అందిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

తల్లిదండ్రులు అప్పోసొప్పో చేసి కళాశాలల్లో ఫీజులు చెల్లిస్తున్నారు. ఫీజులుకట్టని వారిని విద్యార్థులను ఇళ్లకు పంపుతుండటంతో అనివార్యంగా అప్పులు చేసి అయనా ఫీజులు చెల్లించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

చేయూత కోసం ఎదురుచూపులు

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన 45-60 ఏళ్ల లోపు మహిళలకు స్వయం ఉపాధి కోసం ఏటా రూ.18,750 ఇస్తామన్న ప్రభుత్వం నాలుగో ఏడాది చాలా ఆలస్యంగానే నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. అనకాపల్లి జిల్లా పిసినికాడలో సిఎం జగన్ వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులను మార్చి 7న విడుదల చేశారు. కానీ జిల్లాలో 30 శాతం మందికి కూడా నిధులు రాలేదు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన 93,275 మందికి రూ.18,750 చొప్పున నిధులు రూ.174.88 కోట్లు విడుదల చేశారని అధికారులు ప్రకటించారు. దాదాపు నెల

2లో

పిడుగురాళ్ల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్

నేడు సిఎం జగన్ యాత్ర ఇలా...

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా 12వ రోజు బుధవారం సిఎం జగన్ పల్నాడు జిల్లా నర్సరావుపేట, గురజాల, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి బయలుదేరతారు. పుట్టవారిపాలెం, సంతమాగులూరు క్రాస్, రొంపిచర్ల క్రాస్, విప్పర్ల, నకరికల్లు మీదుగా దేవరంపాడు క్రాస్ వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం కొండమోడు, పిడుగురాళ్ల బైపాస్ మీదుగా మధ్యాహ్నం 3.30 గంటలకు అయ్యప్పనగర్ బైపాస్ సభ ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభ అనంతరం కొండమోడు జంక్షన్, అనుపాలెం, రాజుపాలెం, రెడ్డిగూడెం మీదుగా ధూళిపాళ్ల వచ్చి అక్కడ రాత్రి బస శిబిరానికి చేరుకుంటారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు.

పిడుగురాళ్లలో నిర్వహించే బహిరంగ సభకు మాచర్ల, గురజాల నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సిఎం బందోబస్తు కొనసాగుతుందని పల్నాడు ఎస్‌పి జి.బిందుమాధవ్ తెలిపారు. సిఎం జగన్ పర్యటించే ప్రాంతాల్లో మంగళవారం ఆయన పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. గంటవారిపాలెం గ్రామం వద్ద

2లో



శ్రీకృష్ణదేవరాయలు ప్రచార వాహనం ధ్వంసం

ప్రజాశక్తి - రెంటచింతల

టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రచారం వాహనంపై దుండగులు మంగళవారం రాత్రి దాడి చేశారు. మండలంలోని మంచికల్లులో డిజిటల్ ప్రచారం వాహనం ప్రచారం ముగించుకుని వెళ్తుండగా గ్రామ శివారులో కొందరు దాడి చేశారు. ఆ సమయంలో వాహనంలో డ్రైవర్ మాత్రమే ఉన్నారు. దాడిని డ్రైవర్ అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆయనపైనా దాడి చేశారు. డిజిటల్ స్క్రీను, మిషను, ఇతర యంత్రాలను ధ్వంసం చేశారు. ఫ్లెక్సీలను చింపారు. దీనిపై టిడిపి మండల అధ్యక్షులు చపారపు అప్పిరెడ్డి రెంటచింతల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనా న్ని ఎఎస్ఐ హనుమంత రావు పరిశీలించి విచారణ చేస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం): 6.27

మాట్లాడుతున్న ఇండియా వేదిక ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకరరావు

5లో

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

- వడ్డేశ్వరం జనరల్‌బాడీలో సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య
- నియోజకవర్గంలో సిపిఎం విస్తృత ప్రచారం, సమావేశాలు

3లో

ఆద్యంతం అలరించిన నాటికలు

వార్త మెయిన్‌లో

రాష్ట్ర ప్రజలకు శుభాలు, విజయాలు సిద్ధించాలి

ఉగాది వేడుకల్లో సిఎం జగన్ దంపతులు

రూ.4.92 లక్షల నగదు, డ్రగ్స్ సీజ్

ప్రజాశక్తి-గుంటూరు :జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి తనిఖీలు చేపట్టారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో రూ.50 వేల మాదకద్రవ్యాలు, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.1,63,500 నగదు, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.2,79,000 నగదు సీజ్ చేశారు. ఇప్పటి వరకూ మొత్తం రూ.రెండు కోట్ల 5 లక్షల 41 వేల 680 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు.

సంక్షేమ పథకాలు ఎప్పుడూ ఉంటాయి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సింఛన్లు, సంక్షేమం వంటివి జగన్ సిఎం కాకముందు కూడా ఉన్నాయని, ఇక మీదటా ఉంటాయని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక 18వ వార్డులో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు పంచారు. వైసిపి ఓడిపోతే పింఛన్లు రావంటూ వైసిపి తన మీడియా ద్వారా ప్రజల్ని భయపెడుతోందని, వీటిని ప్రజలు నమ్మొద్దని కోరారు. అనంతరం కుటుంబ సాధికార సారథులు, కూటమి పార్టీల శ్రేణులతో సమావేశమయ్యారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక 10వ వార్డు వైసిపి మాజీ కౌన్సిలర్ షేక్ రౌఫ్‌తో పాటుగా 15 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరిని కండువాలు కప్పి ఆహ్వానించారు.

బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపేందుకు మహిళలంతా సిద్ధం : లీలావతి

ప్రజాశక్తి-ఈపూరు

బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపేందుకు మహిళలందరూ సిద్ధంగా ఉన్నారని జీవి ఆంజనేయులు భార్య లీలావతి అన్నారు. మండలంలోని ఎ.ముప్పాళ్లలో వైసిపిని వీడి 25 కుటుంబాలు టిడిపిలో చేరగా వారికి లీలావతి టిడిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్ల పెంపు, సూపర్ సిక్స్ పథకాలు, మహిళలకు అండగా నిలుస్తాయన్నారు. గడచిన ఐదేళ్లలో వైసిపి పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, నాయకులు ఆర్.జగ్గారావు, మాజీ సర్పంచ్ ఎం.నరసింహారావు, ఐ.హనుమయ్య, కె.నందవీరప్రసాద్ పాల్గొన్నారు.

కారంపూడిలో నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - కారంపూడి

మండల కేంద్రమైన కారంపూడిలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయము ఎదురుగా ఉన్న క్షేత్రపాలక శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది రోజు నుండి శ్రీరామనవమి వరకు 9 రోజులు తొమ్మిది రకాల అలంకారాలతో విశేష సింధూర లేపన నాగవల్లి పూజ, అష్టోత్తర పూజ కార్యక్రమాలు జరుగుతాయని దేవాలయం చైర్మన్ సన్నిధి లక్ష్మీ వెంకట జగన్ మోహన్‌రావు మంగళశారం తెలిపారు. ఉత్సవాలకు దేవాలయం మహిళా చైర్మన్ కోట రూ.50 వేల విరాళాలు వసూలు చేసి అందించారు. 70 ఏళ్లుగా ఇలాంటి ఉత్సవాలు జరగలేదని, ఇదే ప్రథమమని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

పట్టణ వాసులకు అవార్డులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి : సత్తెనపల్లికి చెందిన సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవి 'శ్రీకృష్ణ దేవరాయల అవార్డ్' 'ఉగాది అవార్డు' అందుకున్నారు. విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ సోమవారం విజయవాడలోని హనుమంత గ్రంథాలయంలో అవార్డులను ప్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బండారు నరసింహారావు, గౌరవాధ్యక్షులు టి.సూర్యనారాయణ, ఓగా గురువు కొండయ్య, తహశీల్దార్ ఆశయ్య, జాతీయ అవార్డు గ్రహీత కె.రత్నకుమారి సత్కరించారు.

పట్టణానికి చెందిన పౌరాణిక కళాకారులు బెజగం రవికుమార్‌కు విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ విజయవాడ 'శ్రీకృష్ణ దేవరాయ నట కళారత్న, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేసింది. అవార్డులను విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయం ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రవికుమార్ అందుకున్నారు.

సొంతూరులో పనిలేక పొరుగూరుకు ప్రమాదకరంగా..

ప్రజాశక్తి - పెదకూరపాడు

పొలం పనుల్లేక, ఉపాధి హామీ అమలవ్వక వ్యవసాయ కూలీలు వలస బాట పడుతున్నారు. మండే ఎండల్లోనూ ఇతర ప్రాంతాలకు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నారు. పెదకూరపాడు ప్రాంతంలో వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి పంటలే ప్రధాన సాగు. ఏ కొత్త వంగడమైన పెదకూరపాడులోనే ప్రయోగించేవారు. తరువాత ఆ విత్తనాలను మిగతా ప్రాంతాల్లో మార్కెట్ చేసుకునే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం పాలకుల వైఫల్యం, ప్రకృతి సహకరించకపోవడంతో వ్యవసాయం దెబ్బతింది. దీంతో రైతులతోపాటు వ్యవసాయ కూలీలు సైతం దూర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లే దుస్థితి ఏర్పడింది. నాగార్జునసాగర్ నీరు అందని గ్రామాలు పెదకూరపాడు మండలంలో 12 ఉన్నాయి. ఈ ప్రాంతంలో పనుల్లేక సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు, అచ్చంపేట మండలం తాళ్ల చెరువు, కస్తల, కోనూరు, క్రోసూరు మండలం నాగవరం ప్రాంతాలకు వెళుతున్నారు. మరోవైపు పశువులకు మేత కూడా దొరకడం లేదు. పంటల దిగుబడి అంతంతమాత్రంగానే ఉండడం, ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులూ నష్టాలను చవిచూశారు.

ఉపాధి హామీ పనులు చేపట్టాలి

జి.రవిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి.

కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం లేకుండా ఏ ఊరిలో వారికి ఆ ఊరిలోనే ఉపాధి హామీ చట్టం కింద సత్వరమే పనులు కల్పించాలి. 100 రోజుల నుండి 150 పని దినాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. వేసవి అలవెన్సులు ప్రకటించాలి.

వైసిపి మాయలో పడి వాలంటీర్లు రాజీనామా చేయెుద్దు

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

ప్రజాశక్తి - వినుకొండ

వాలంటీర్లకు టిడిపి, చంద్రబాబు ఎప్పుడూ వ్యతిరేకం కాదని, ఆ ముసుగులో చేస్తున్న రాజకీయాలకే వ్యతిరేకమని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే వాలంటీర్లకు నెలకు రూ.10 వేల గౌరవం వేతనం ఇస్తామని చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. మండలంలోని ఉమ్మడివరం, పిట్టంబండలో జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లతో వెట్టి చాకిరీ చేయించుకోవడం, స్వార్థ రాజకీయ ప్రయోజనాలు చూసుకోవడం తప్ప వారి సంక్షేమం గురించి జగన్ ఆలోచించలేదన్నారు. వైసిపి మాయలో పడి వాలంటీర్లెవరూ రాజీనామాలు చేయెుద్దన్నారు. కష్టం వాలంటీర్లది, ఫలితం జగన్‌ది అన్నట్లు పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు సిఎం కాగానే వాలంటీర్ల కష్టాలు తీరుతాయన్నారు. ప్రజల కష్టాలు తీరే రోజు దగ్గరలోనే ఉందని, అప్పటివరకు ఓపిక పట్టాలని ప్రజలతో అన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

ఉగాది వేడుకల్లో..

ఆకలి, పేదరికం లేని రాష్ట్రమే చంద్రబాబు స్వప్నమని జీవీ ఆంజనేయులు అన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి బాధలు తీర్చుతూ, సూపర్‌సిక్స్ పథకాల ద్వారా అన్నివర్గాలను సాధికారిత వైపు నడిపించాలనే లక్ష్యంగా చంద్రబాబు పెట్టుకున్నారన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు పేదలకు పింఛను పెంచింది చంద్రబాబే అని, ఇప్పుడు మళ్లీ పెంచబోతున్నది కూడా చంద్రబాబే అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉపాధి కల్పనలోనూ అందరికీ న్యాయం చేసింది టిడిపి ప్రభుత్వమన్నారు. అందుకు పూర్తి విరుద్ధంగా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ అంటూ అయిదేళ్లు నిరుద్యోగుల ఉసురు పోసుకున్న ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు రాజకీయ నిరుద్యోగిగా మారబోతున్నారని ఎద్దేవా చేశారు.

విజృంభిస్తున్న తట్టు, చికెన్‌ఫాక్స్..!

గ్రామీణ ప్రాంతాలు తండాల్లో అధికంగా బాధితులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వేసవి కావడంతో పల్నాడు జిల్లాలో తట్టు (మీజిల్స్), చికెన్‌ఫాక్స్ కేసులు అవుతున్నాయి. వైరస్ లా ఒకరి నుండి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందే ఈ వైరస్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని వైద్యులు చెబుతున్నారు. తట్టు, చికెన్‌ఫాక్స్‌కు సంబంధించి పలు కేసులు నమోదైనా బాధితులు ప్రైవేటు హాస్పిటల్‌ను లేదా నాటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు తండాల్లో ఈ వ్యాధి ఉధృతి ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ప్రధానంగా పదేళ్లలోపు పిల్లలు వీటి బారిన ఎక్కువగా పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పొట్ట కూటి కోసం వచ్చిన వలస కూలీల కుటుంబాల్లో ఎక్కువగా కనిపించినట్లు చెబుతున్నారు. ఆ కుటుంబాల పిల్లలు వ్యాక్సినేషన్ చేయించుకోకపోవడంతో తట్టు చికెన్‌ఫాక్స్ బారిన పడ్డారని, దీన్ని నిర్లక్ష్యం చేస్తే పిల్లలకు ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లక్షణాలు : జ్వరం, శరీరంపై దద్దుర్లు, నీరసం, ఆకలి మందగించడం, కళ్లు ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అటువంటి లక్షణాలు అనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి. తట్టు సోకిన వారిలో లో జ్వరం ఎక్కువగా ఉంటుంది. వారం నుంచి రెండు వారాల వరకు పిల్లలపై ఆ ప్రభావం ఉంటుంది. జలుబు, దగ్గు, తుమ్ములు ద్వారా ఈ వ్యాధి ఇతర పిల్లలకు వ్యాపించే అవకాశముంది. లక్షణాలు కనిపించగానే తగిన జాగ్రత్తలు తీసుకోని, వైద్యులను సంప్రదించాలి.

వ్యాక్సిన్ పట్ల నిర్లక్ష్యం వీడాలి

డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

ఎంఎంఆర్ (మీజిల్స్-మండ్స్-రెబుల్లా) వ్యాక్సిన్ వేయిస్తే తట్టు, చికెన్ ఫాక్స్ (అమ్మవారు) వంటివి సోకకుండా చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పిల్లలకు 12-15 నెలలలోపు ఒక డోసు, 4 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు మరో డోసు వ్యాక్సిన్ వేయించాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వ్యాక్సిన్ ఇస్తారు. చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు వ్యాక్సిన్ వేయించే విషయంలో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నాం.

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోమందులు

డాక్టర్ బి.రవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి..

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తట్టు, చికెన్‌ఫాక్స్‌కు మందులు అందుబాటులో ఉన్నాయి. ఆయా వ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా నిర్లక్ష్యం చేయడం శ్రేయస్కరం కాదు. లక్షణాలు కనిపిస్తే తక్షణమే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలి. వైద్యుని సలహా మేరకు చికిత్స పొందాలి. నాటు వైద్యులను ఆశ్రయించొద్దు.

నేడు సిఎం జగన్ యాత్ర ఇలా...

(మొదటి పేజీ తరువాయి)

నుండి రొంపిచర్ల, నకరికల్లు, రాజుపాలెం మీదుగా పిడుగురాళ్ల అక్కడ బహిరంగ సభ చూసుకుని అనంతరం సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల వరకు సుమారు 77 కిలోమీటర్లు సాగనున్న నేపథ్యంలో బందోబస్తుపై అధికారులతో చర్చించారు. రాత్రికి సిఎం బస చేసే దూళిపాళ్ల శిబిరం వద్ద కూడా అధికారులకు తగిన సూచనలు చేశారు. బస్సు ముందు, వెనుక, పక్కన అడ్వాన్స్ క్లియరెన్స్ బృందాలను, బస్సు వెంట వుండే రోప్ పార్టీ బృందాలను, ఏదైనా సంఘటన ఎదురైనపుడు వెంటనే స్పందించే క్విక్ రియాక్షన్ బృందాలను సిద్ధం చేశారు. అనుమానితులను పసిగట్టే నిఘా బందాలను ఏర్పాటు చేయడానికి తగిన మార్గదర్శకాలను పోలీస్ అధికారులకు జారీ చేశారు.ట్రాఫిక్ మళ్లింపులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ఉత్తుత్తిగా నిధుల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పాటు బ్యాంకుల చుట్టూ తిరిగిన సంబంధిత మహిళలు చివరికి ఎన్నికల కోడ్ వచ్చినందున ఇక రానేట్టేనని అధికారులు సమాధానం చెబుతుండటంతో వారు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. తొలుత జూన్‌లో విడుదల చేసిన నిధులు నాలుగు ఏళ్లలో దశలవారీగా కాలయాపన చేస్తూ చివరికి మార్చి 7న విడుదల చేసినట్టు బటన్ నొక్కినా మహిళల ఖాతాల్లో జమ కాలేదని చెబుతున్నారు.

ఒసి మహిళలకు తప్పని నిరాశ

ఓసీ సామాజిక తరగతికి చెందిన 45-60 ఏళ్ల మహిళలకు మూడేళ్ల పాటు ఏటా రూ.15 వేలు చొప్పున అందించే పథకం ఈబీసీ నేస్తం. ఈ పథకం ద్వారా రెండేళ్ల పాటు రూ.15 వేలు చొప్పున జిల్లాలో దాదాపు 20 వేల మంది మహిళలకు అవకాశం దక్కింది. ఏటా డిసెంబరులోగానే ఇచ్చే ఈ పథకాన్ని ఈ ఏడాది మార్చి 14న ఎన్నికల కోడ్‌కు రెండు రోజులముందు కర్నూలు జిల్లా బనగానపల్లె నుంచి సిఎం జగన్ బటన్‌నొక్కి నిధులు విడుదల చేశారు. జిల్లాలో 21,687 మంది మహిళలకు ఈబీసీ నేస్తం పథకం ద్వారా రూ.32.53 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. కానీ ఇంత వరకు నిధులు మహిళల ఖాతాల్లో జమకాలేదు. 16వ తేదీన ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఇక ఈసొమ్మురానట్టేనని లబ్ధిధారులు నిట్టూరుస్తున్నారు.

ఆద్యంతం అలరించిన నాటికలు

ప్రజాశక్తి - యడ్లపాడు

కొండవీటి కళాపరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంయుక్త జాతీయ స్థాయి నాటకోత్సవాలు మూడోరోజైన మంగళవారం మండల కేంద్రమైన యడ్లపాడులో ప్రారంభమయ్యాయి. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలో మూడు నాటికలను ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలుగా సిహెచ్ సృజన, ఎం.శివన్నారాయణ, వినోద్‌బాని వ్యవహరించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి అతిథులు, కళాకారులు పూలమాలలేసి నివాళులర్పించారు. వీరిలో హైకోర్టు న్యాయవాది మానుకొండ ఉపేంద్రరావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఎన్.కాళిదాసు, ప్రముఖ కళాకారుడు డాక్టర్ ఎం.సురేష్‌బాబు, గుంటూరు కళా పరిషత్ అధ్యక్షులు ఎ.పెద్దబ్బయ్య, దేవాదాయ శాఖ విశ్రాంత అధికారి పి.గంగయ్య చౌదరి, సుందరయ్య స్మారక నాటకోత్సవ కమిటీ సభ్యులు జె.శంకరరావు, సిపిఎం మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు, నాయకులు కె.రోశయ్య, కొండవీటి కళాపరిషత్ అధ్యక్షులు కె.శ్రీహరిరావు, కార్యదర్శి టి.సాంబశివరావు, కళాకారులు ఎం.రామారావు, ఎం.కృష్ణ ఉన్నారు. చివరి రోజైన బుధవారం మరో మూడు నాటికల ప్రదర్శనతోపాటు బహుమతులు, జ్ఞాపికల ప్రదానోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

తొలి ప్రదర్శన 'ఇంద్ర ప్రస్థం'

తొలి ప్రదర్శనగా గోపి సత్యప్రసాద్ (స్నిగ్ధ) రచించిన 'ఇంద్ర ప్రస్థం' నాటికను ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో అభినయ ఆర్ట్స్ గుంటూరు కళాకారులు ప్రదర్శించారు. ప్రేమ గొప్పదేగాని ఆ ప్రేమలు హర్షించే విధంగా కన్పించాలే తప్ప అనాలోచితంగా వెర్రిగా పరుగెడితే జీవితం, విలువలు నాశనం అయిపోతాయనే ఇతివృత్తంతో సాగింది. తన కుమారుడు ఒకమ్మాయిని ప్రేమించగా తండ్రి మాత్రం ఆ అమ్మాయి తండ్రి స్థానంలో ఉండి ఆలోచించి కొడుకుకు జాగ్రత్తలు చెబుతాడు. ప్రేమలో మునిగిని వారి తప్పుల్ని సరిదిద్దుతూ క్రమశిక్షణ నేర్పుతూ ఆదర్శవంతమైన తండ్రిగా ఎలా నిలబడతాడు అనేదే నాటిక. యువతలోని ఆకర్షణలు, పెద్దలు మెలగాల్సిన తీరును వివరిస్తూ ప్రదర్శన సాగింది.

రెండో ప్రదర్శన 'బంధం'

రెండో ప్రదర్శనగా మైత్రి కళానిలయం విజయవాడ వారు 'బంధం' నాటికను ప్రదర్శించారు. మాడుగుల రామకృష్ణ రచించగా, టివి పురుషోత్తం దర్శకత్వం వహించారు. మనిషిజీవితం 'బంధం'తో మొదలవుతుంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ళు, మిత్రులు, గురువులు పెళ్ళేయ్యాక పెళ్ళాం, బిడ్డలు.. ఇలా ఎన్నోబంధాలు కానీ కడదాకా కలిసి ప్రయాణం చేసే భార్యాభర్తల బంధం ఎంతో పటిష్టమైనది, విడదీయరానిది. అందునా వద్ధాప్యంలో ఈ బంధం మరింత బలపడి ఒకరికొకరుగా ఒకరికోసం ఒకరిగా మిగిలిపోతారు. కన్నవారు రెక్కలొచ్చి ఎగిరిపోతే మిగిలేది ఆ ఇద్దరే వద్ధాప్యం మనిషికి రెండో బాల్యం పసితనంలోని అలకలు, మంకుపట్టు, ప్రేమలు ఇవన్నీ పునరావతమౌతాయి. కొట్టినా అమ్మని వదలక కౌగిలించుకునే పసివాడులా దంపతుల మధ్య తగవులు, కీచులాటలు తాత్కాలికం. క్షణంలో మళ్ళీకలుస్తారు. కొత్తదనాన్ని తన వెర్రిఆలోచనలతోకోరుకున్న సుబ్బారాయుడు లోకం హర్షించని రీతిలో భార్యను దూరం పెడతాడు. స్నేహితుడు నారాయణ హితోక్తులు వినడు. తానొక కొత్తగేమ్ మొదలెట్టాననుకొంటాడు. కాని ఆ గేమ్ను తలక్రిందులు చేస్తూ ఆపైవాడు మరోగేమ్ ఆడి అతడ్ని మనస్తాపానికి గురిచేస్తాడు. తట్టుకోలేని సుబ్బారాయుడు విలపిస్తాడు. ఊహించని మరో మలుపుతో కళ్ళు తెరిచి తన తప్పును దిద్దుకునే ఇతివృత్తంతో ప్రదర్శన సాగింది.

తృతీయ ప్రదర్శన 'రాత'

మూడో ప్రదర్శనగా పోలిదాసు శ్రీనివాసరావు రచించి, దర్శకత్వం వహించిన 'రాత' నాటికను వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు కళాకారులు ప్రదర్శించారు. మనిషికి కష్టం కలిగితే నా రాతింతే, నా రాత బాగోలేదు అంటూ ఉంటాడు. సుఖం విషయంలో మాత్రం రాతను గాలికొదిలేస్తాడు. తాను పొందాల్సినవి మంచిగా పొందుతాడు, తాను తిరిగి ఇవ్వాల్సిన వాటి విషయంలో మాత్రం బాధ్యతా రహితంగా ఉంటాడు. అది ఎదుటి మనిషి విషయంలోనైనా, ప్రకృతి విషయంలోనైనా. ఇలాంటి మనిషి నైజం వల్ల ప్రస్తుత సమాజంలో ఏం జరుగుతోంది? సమాజం ఎటు పోతోంది? మనిషి జీవనం ఎలా సాగుతోంది? ఈ అనర్ధాలకు కారణం ఎవరు? ఇది ఎవరు రాసిన రాత? అనే ఇతివృత్తంతో నాటిక ప్రదర్శించారు.

నేడు వర్శిటీ వీసి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - ఎఎన్‌యు :వర్శిటీలో న్యాక్ పర్యటన సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ తెలిపారు. బుధవారం ఉదయం 11.30గంటలకు డైక్ మన్ ఆడిటోరియంలో సమావేశం జరుగు తుందన్నారు. సమావేశంలో క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు, డైరెక్టర్లు, టీచింగ్ ఫ్యాకల్టీ రెగ్యులర్/ కాంట్రాక్ట్/ గెస్ట్ ఫ్యాకల్టీ/ గౌరవ ఆచార్యులు, ఫైనాన్స్ ఆఫీసర్, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, యూనివర్శిటీ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, సిఈ, ఏసిఈ, దూరవిద్యా కేంద్రం అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం రాత్రి మీడియాకు తెలిపారు. తనకు గుంటూరు తూర్పు టిక్కెట్ ఇప్పిస్తానని, దరఖాస్తుచేసుకోమని చెప్పిన మస్తాన్ వలి తిరిగి ఆయనే పోటీ చేయడానికి పూనుకోవడం వల్ల తాను మనస్తాపానికి గురై పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. తనతో పాటు మొత్తం 42 మంది డివిజన్ స్థాయి నాయకులు రాజీనామా చేశారన్నారు. పార్టీలో ఎంత కష్టపడినా గుర్తింపు లేదన్నారు. 2019లో కూడా ఇలాగే అన్యాయం జరిగిందన్నారు. భవిష్యత్తుపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ఎఆర్ కాలనీకి చెందిన సిపిఎం సానుభూతిపరురాలు మరియమ్మ (60) మంగళవారం మృతిచెందారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుంది. మరియమ్మ మృతదేహాన్ని ఇండియా వేదిక అభ్యర్థి జొన్నా శివశంకరరావు, నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, శ్రీనివాసకుమారి, డి.విజయబాబు, గోపిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

తెనాలి రూరల్‌లో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - తెనాలి :సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రూరల్ గ్రామం కొలకలూరు లో జనసేన పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. జనసేన టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తరపున ఆయన కుమారుడు నాదెండ్ల మితుల్ ప్రచారంలో పాల్గొన్నారు. కోనేటి పురం, ఎస్టీ కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వ హించారు. తెనాలి ప్రాంత అభివద్ధికి మనో హర్ ను గెలి వి ంచా ల ని ఓటర్లను కోరారు. ఆయన వెంట జనసేన, టిడిపి నాయ కులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 6, 14 వార్డుల సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎంపి అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య విజయాన్ని కాంక్షిస్తూ వైసిపి నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ముందుగా రామాలయం సెంటర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్ర ముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, గుంటూరు జిల్లా జెసిఎస్ అధ్యక్షులు ఈదులమూడి డేవిడ్‌రాజు, విజయవాడ కనకదుర్గమ్మ గుడి ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మేకా వెంకట్రామిరెడ్డి, చిన్న పోతుల దుర్గారావు, ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, వేముల లక్ష్మీ రోజా, సింక గంగాధర్, కళ్లం రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల ప్రచారం

నేలపాడులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని నేలపాడు, ఐనవోలు గ్రామాల్లో మంగళవారం రాత్రి టిడిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాల్జేసిన వైసిపి పాలనకు ప్రజలు రానున్న ఎన్నికలలో చరమగీతం పాడాలని కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ కోరారు. ప్రజాకంటక పాలన సాగించిన వైసిపికి ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. కూటమి తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని శ్రావణ్ కుమార్ అభ్యర్దించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనేకుల సుబ్బారావు, దామినేని శ్రీనివాసరావు, నూతలపాటి రామారావు, మైనేని గిరిజ, అంకం సువర్ణ కమల, వలపర్ల జ్ఞానానందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని క్రషర్ టిప్పర్ వెనకగా వచ్చి బలంగా ఢీకొనడంతో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల డొంక లో మంగళవారం జరిగింది. మండలంలోని డోకిపర్రు గ్రామానికి చెందిన ఉడతా బుల్లి వెంకయ్య, తన స్నేహితుడు మొక్కల బ్రహ్మం ఇరువురు ద్విచక్ర వాహనంపై చేబ్రోలు మండలం అనంతారం వెళ్లి అక్కడ పని చూసుకుని తిరుగు ప్రయాణమై ఇంటికి బయలు దేరారు. మార్గమధ్యలో పేరేచర్ల డొంక దగ్గరకు రాగానే వెనుకగా వచ్చిన క్రషర్ టిప్పర్ లారీ బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనం పైన ఉన్న ఉడతా బుల్లి వెంకయ్య(33) రోడ్డుపై పడిపోయాడు. లారీ అతనిపైగా ఎక్కి దిగడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద సంఘటన స్థలానికి చేరుకున్న మేడికొండూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జరిగిన ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

22 బైకులు 6230 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కోడిపందాల స్థావరం పై పోలీసులు దాడి చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుండి 6230రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి మండలం భగుబండ రైల్వే ట్రాక్ సమీపంలో కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు మంగళవారం దాడిచేశారు. పోలీసులు రాకను గమనించిన జూదరులు కొంతమంది బైకులు వదిలేసి పరారయ్యారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని 22 బైకులు కోడిపుంజును, నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ ఎం రాజేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

నేర చరిత్ర లేని నన్ను గెలిపించండి : డాక్టర్ వై.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

నేర చరిత్ర లేని, 365 రోజులు ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని ఇండియా కూటమి తరుపున మాచర్ల అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వై.రామచంద్రారెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలో తన ఎన్నికల ప్రచారాన్ని ఆయన మంగళవారమూ కొనసాగించారు. నియోజకవర్గాన్ని మాఫియా ముఠాలతో, భూకబ్జాదారులతో, హత్య రాజకీయాలతో ముంచటానికి సిద్ధంగా ఉన్న వైసిపి, టిడిపి అభ్యర్థులను ఓడించాలని, తనను గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 9 గ్యారెంటీల ద్వారా సంక్షేమాన్ని అందుకోవాలన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చంద్ర రాజేశ్వరరావు, ఆశయాలను కొనసాగిస్తామని సిపిఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్లోని సిపిఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలానికి ఆకర్షితులయ్యారని చెప్పారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో కమ్యూనిస్టు సెల్ ఏర్పాటుకు నాంది పలికారని, అందుకే రాజేశ్వరరావును 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' అవార్డుతో సోవియట్ యూనియన్, 'ఆర్డర్ ఆఫ్ డెమిట్రోవ్' అవార్డుతో బల్గేరియా, చెకోస్లోవేకియా, మంగోలియా దేశాలు సత్కరించాయని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పి.రామారావు, నాయకులు బి.లలిత కుమారి, బి.భగత్‌సింగ్, ఎం.నాగేశ్వరరావు, టి.నరసమ్మ, సుబ్బాయమ్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

50 కుటుంబాలకు నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన షేక్ అహ్మద్ 50 కుటుంబాలకు నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. రంజాన్ సందర్భంగా పేదలకు రంజాన్ పండుగ చేసుకోవడానికి వీటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్, అంజుమాన్ మాజీ అధ్యక్షులు షేక్ మహమ్మద్ షరీఫ్, నాయబ్ ముస్తఫా పాల్గొన్నారు.

గొంతెండుతున్నా వృథా అవుతున్న నీళ్లు..

బోర్ల నిర్వహణలో నిర్లక్ష్యంతో నేలపాలవుతున్న జలం

కొత్తపల్లి ఎస్సీకాలనీలో వృథాగా పోతున్న నీరు.. అచ్చమ్మకుంట తండాలో బోరు నుండి వృథా అవుతున్న నీరు

అచ్చమ్మకుంటతండాలో సరిపడా నీరులేక నిరూపయోగంగా వాటర్‌ట్యాంకు

అచ్చమ్మకుంటతండాలో బోరునుండి మంచినీటిని తెచ్చుకుంటున్న చిన్నారులు

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

ఎండలు మండుతూ నీటి జాడలు అడుగంటుతున్న వేళ ఒక వైపు నీటిఎద్దడితో గ్రామీణులు అలమటిస్తుంటే, మరోవైపు నీరు వృథా అవుతోంది. మాచర్ల మండలంలోని అచ్చమ్మకుంట తండాలో నీటి ఎద్దడి నెలకొని స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటివలే ప్రభుత్వం ఒక బోరును వేశారు. అయితే దాని నిర్వహణలో లోపాల కారణంగా నీరు వృథా ఎక్కువగా ఉంది. ఆ బోరు వద్ద ఇంజిన్ ఆడుతున్నంత సమయం నీరు వస్తూనే ఉంటుంది. వివిధ పనులు కారణంగా గ్రామస్తులు అందరూ ఒకే సమయంలో నీరు పట్టుకోవడానికి వీలవడం లేదు. ఒకరి తర్వాత మరొకరు వీలున్నప్పుడు నీరు పట్టుకుంటున్న కారణంగా ఈ మధ్యలో నీరంతా నేలపాలవుతోంది. పైపులైన్లు లేకపోవటంతో దూరం నుంచి వచ్చి ఆ నీటిని పట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లడంతో ఇళ్ల వద్ద ఉన్న చిన్నారులే బోరు వద్ద నుండి నీరు పట్టుకుని దూరంగా ఉన్న తమ ఇళ్లకు బిందెలతో మోసుకుంటున్నారు. నీరు వృథా కాకుండా బోరు ఇంజన్‌ను ఎక్కువ సార్లు ఆన్, ఆఫ్ చేస్తే మోటారు పాడవుతుందనేది తండా వాసుల భయం. గ్రామంలో ఒక ఒవర్‌హెడ్ ట్యాంకు వుంది. ఆ ట్యాంకును నింపే బోరులో కొద్దినీరే వస్తుంది. దాంతో ట్యాంకు నిరూపయోగంగా మారింది. నీరు ఎక్కువగా వచ్చే బోరు నుంచి ఆ ట్యాంకు నింపటం ద్వారా అందరికీ పైపులు ద్వారా నీరందించే అవకాశం ఉంటుందని, నీరు అలా పోతుంటే తాము చూడలేకపోతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

మండలంలోని మరో గ్రామమైన కొత్తపల్లిలోనూ నీరు వృథా అవుతోంది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇటీవలే బోరు వేశారు. ఆ బోరు మోటారు ఆడుతున్నంతసేపు నీరు వస్తూ వుంటుంది. ఒకరివెంట మరొకరు నీటిని పట్టుకునేవారు లేక, మోటారు ఆన్ చేసి ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బోరు వద్ద ఒక నీటి ట్యాంకు నిర్మిస్తే నీటి వృథాను అరికట్టడంతోపాటు విద్యుత్‌నూ ఆదా చేయొచ్చు.

నేడు పిడుగురాళ్లలో మేమంతా సిద్ధం సభ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో 'మేమంతా సిద్ధం' సభ బుధవారం నిర్వహిస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. సభకు సంభందించి ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని, కార్యకర్తలకు, ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచామని అన్నారు. సభా ప్రాంగాణం వద్ద తాగునీరు, భోజనాల వసతి కూడా ఉందన్నారు. బస్సు యాత్ర ద్వారా కొండమోడు నుండి పిడుగురాళ్ల బైపాస్ మీదుగా పట్టణ శివారు ప్రాంతంలోని అయప్పస్వామిగుడి సమీపంలో ఏర్పాటు చేసిన సభ వేదిక వద్దకు సాయంత్రం సిఎం జగన్ చేరుకుంటారని అన్నారు. జగన్ సిఎం అయ్యాక తొలిసారిగా గురజాల నియెజకవర్గానికి వస్తున్న సిఎం సభకు 3 లక్షల మంది హాజరవుతారని చెప్పారు.

దుమ్మురేగుతున్న రోడ్డు

ప్రజాశక్తి - కారంపూడి

మండల పరిధిలోని పేటసన్నెగండ్ల నుండి నరమాలపాడు వెళ్లే మాచర్ల - నరసరావుపేట ప్రధాన రహదారి పెద్దపెద్ద గుంతలతో దారుణంగా తయారైంది. వీటిల్లో ఇటీవల అధికారులు తాత్కాలిక డస్ట్ పౌడర్ వేయించడంతో వాహన రాకపోలు, గాలి వీచిన సందర్భంలో దుమ్ము, దూళి విపరీతంగా వస్తూ స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రోడ్డు వేయించడానికి బదులు మమ అనిపించడం తాము రోగాల బారిన పడే ప్రమాదం వచ్చిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే ఎండలతో అల్లాడుతున్న తాము కొత్తగా ఈ దుమ్మును పీల్చుకోవడం వల్ల శ్వాశ కోశ వ్యాధులకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువతను మోసం చేసిన మోడీ : కాంగ్రెస్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీనిచ్చిన మోడీ యువతను మోసం చేశారని, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలైనా ఇవ్వకపోగా నిరుద్యోగ సమస్యను మరింత పెంచారని చిలకలూరిపేట అసెంబ్లీ స్థానానికి 'ఇండియ' వేదిక తరుపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రాధాకృష్ణ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నల్లధనాన్ని వెలికి తీసి పేదల ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తామని చెప్పిన మోడీ ఆ మాటనే విస్మరించారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం ద్వారా వచ్చిన రూ.5 లక్షల కోట్లను ఏం చేశారని ప్రశ్నించారు. మోడీ పాలనలో ప్రజా సంక్షేమం కోసం ఒక్క పథకాన్నయినా ప్రవేశపెట్టారా? అని ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని, వీటిపై ప్రశ్నించిన వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో ఇబ్బంది పెట్టడం కోసం బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారని విమర్శించారు. ఈ నిరంకుశ విధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలని, వచ్చే ఎన్నికల్లో బిజెపిని, దాని మద్దతు పార్టీలను ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

మాచర్లలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో మంగళవారం సాయంత్రం పోలీసులు కవాత్ నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను ప్రత్యేక పోలీసు బలగాలు అందుబాటులోకి వచ్చినట్లు అర్బన్ సిఐ శరత్‌బాబు తెలిపారు. తమకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

వడ్డేశ్వరం జనరల్‌బాడీలో సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య

నియోజకవర్గంలో సిపిఎం విస్తృత ప్రచారం, సమావేశాలు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

దేశాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ, దేశాన్ని దోచుకు తింటున్న మోడీ ప్రభుత్వాన్ని కచ్చితంగా ఓడించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం ఎస్సీ కమిటీ హాల్ వద్ద మంగళవారం రాత్రి సిపిఎం నాయకురాలు కారసాల స్వాతి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారులకు వచ్చిన తర్వాత రైతాంగ చట్టాలను, కార్మిక చట్టాలను కాలరాయడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. మతోన్మాద బిజెపి రాష్ట్రాల హక్కులను కాలరాయడమే కాక, ప్రజలపై అదనపు భారాలు వేసిందన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీకి తొత్తుగాను, పోత్తులు గాను మారారని ఆయన ఎద్దేవా చేశారు. సంవత్సరం కాలం పాటు ఢిల్లీలో నల్ల చట్టాలు రద్దు చేయాలని దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమం చేసిందని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించేది ఎర్రజెండా మాత్రమేనని ఆయన అన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరంకుశ పరిపాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా టిడిపి వైసిపి పార్టీలు మాట్లాడకపోగా మోడీ విధానాలని అనుసరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దిదించాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో శాసనసభ అభ్యర్థిగా కామ్రేడ్ జొన్న శివశంకరరావు ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన అన్నారు. మంగళగిరి శాసనసభ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రం ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన అధికార పార్టీగా ఉన్న వైసిపి, ప్రతిపక్ష పార్టీలైన టిడిపి జనసేనలు మోడీ విధానాలని అనుసరించటం దుర్మార్గమన్నారు. సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ మోడీ తన అధికారులకు వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగాలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర పన్నారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్ లను మార్చి కార్మికుల పొట్ట కొట్టారని ఆయన విమర్శించారు. దేశాన్ని అధోగతి పాలు చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు వడ్డేశ్వరం బిక్షాలు, వడ్డేశ్వరం కోటేశ్వరరావు, గుడిసె శ్రీనివాసరావు, బి నాగిరెడ్డి, మరియ బాబు, లటికే కోటేశ్వరరావు, ఎస్కే పాపా సాహెబ్, వి పున్నయ్య, ఎస్.కె పున్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : పెనుమాకలోని పలువురు సిపిఎం సీనియర్ నాయకులను ఇండియా వేదిక మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్నా శివశంకరరావు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు గ్రామంలో సిపిఎం సర్పంచులు చేసిన అభివృద్ధిని ప్రస్తావించారు. నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాజకీయాల కతీతంగా నిస్వార్ధంగా మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశారని, తర్వాత ఎన్నికైన ఎమ్మెల్యేలు ఆ విధంగా చేయలేకపోయారని అన్నారు. అనంతరం జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ ఓటర్లు చైతన్యం కలిగిన వారని, వారు అభివృద్ధికే పట్టం కడతారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రైతులు, కార్మికులు, కూలీలు, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిన చరిత్ర సిపిఎంకు ఉందన్నారు.కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు ఎస్కె ఎర్రపీరు, షేక్ ఖాదర్‌బాబా, కళ్లం వేణుగోపాలరెడ్డి, గోపిరెడ్డి పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ఆత్మకూరులో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఇండియా కూటమి అభ్యర్థులు గుంటూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ మరియు మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకర్‌రావుల విజయాన్ని కాంక్షిస్తూ ఆత్మకూరులోని సిపిఎం సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య ఇంటి వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

చినకాకానిలో ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మంగళగిరి నియోజకవర్గంలో ఇండియా కూటమి అభ్యర్థిగా సిపిఎం పార్టీ నుండి పోటీ చేస్తున్న జొన్న శివశంకర్ రావు మంగళవారం చినకాకాని గ్రామంలోనీ దీన్ దయాల్ నగర్ లో పర్యటించారు. అక్కడి ప్రజలను కలిసి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న విధానాలను ప్రజలపై మోపుతున్న భారాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె. నాగేశ్వరరావు, చిన్న కాకాని గ్రామ నాయకులు జి బాబు వరప్రసాద్, వట్రం పూర్ణయ్య, కాజా శంకరరావు, సాంబశివరావు, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెనుమాకలో సిపిఎం సీనియర్ నాయకులు బచ్చలకూరి ఫ్రాన్సిస్‌ను పరామర్శిస్తున్న జొన్న శివశంకరరావు తదితరులు

ఆత్మకూరు సమావేశంలో జంగాల అజయ్‌కుమార్, మొసలి పకీరయ్య తదితరులు

చినకాకాని ప్రచారంలో జొన్నా శివశంకరరావు, ఈమని అప్పారావు తదితరులు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఉగాది వేడుకలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలకు విద్యావేత్త శాంతా శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు.ప్రముఖ సాహితీవేత్త భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఈ వేడుకలను ప్రారంభిస్తూ మోడువారిన జీవితాల్లో వెలుగులు తప్పక నిండుతాయని ప్రకృతి చెప్పే గొప్ప సందేశాన్ని తీసుకొస్తుంది ఈ ఉగాది అన్నారు. జీవితం అంటే సుఖం, దుఃఖం, సంతోషం, కష్టం, ఆనందం, విచారాల సమ్మేళనమని, ఉగాది పచ్చడి రుచుల సాక్షిగా చెప్పే పండుగ ఉగాది అన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలపై ఆధునిక కవితా గోష్ఠి నిర్వహించారు. ఆయారాం గయారాం రాజకీయాలు, ఎన్నికల పార్టీల నాయకుల తీరుపై పాల్గొన్న కవులు బి.జమదగ్ని, ఎస్.ఎం.సుభాని, వెంగళ భాగ్యలక్ష్మి, రాజన్న, శేషఫణి శర్మ తమ కవితలు వినిపించారు. హుషారుగా జరిగిన మాటా-పాట కార్యక్రమాన్ని అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్ళ అశోక్ నిర్వహించగా, రామకృష్ణ రెడ్డి, సాయిబాబ, కొనతం నాగేశ్వరరావు, మల్లేశ్వరరావు గేయాలు ఆలపించారు.ఈ సందర్భంగా ముగ్గురు సాహితీవేత్తలు డాక్టర్ బి.వి.రాంకుమార్, రామడుగు వెంకటేశ్వరశర్మ, డాక్టర్ మైలవరపు లలితకుమార్‌కు ఉగాది పురస్కారాలు అందించారు. సత్కార గ్రహీతల గురించి రచయిత్రి ఏవీకే సుజాత పిఎస్ మూర్తి వివరించారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఉగాది పురస్కారాలు అందిస్తున్న అవగాహన సభ్యులు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ తోనే సాధ్యమని తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చిలకా విజయ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారానికి సమాయత్తంలో భాగంగా ఆయన మంగళవారం రాజధాని ప్రాంతం వెంకటపాలెంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు జరిపారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో విజయ్ కుమార్ మాట్లాడారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం, రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ రైతులకు సమాన ప్యాకేజి, కౌలు చెల్లింపు తదితర సమస్యల పరిష్కారం పై టిడిపి వైఖరి ఏమిటో కూటమి అభ్యర్థి శ్రావణ్ కుమార్ తెలియజేయాలని విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. భూమిలేని పేదలకు ఇచ్చే అమరావతి సామాజిక ఫించన్‌ను వైసిపి అభ్యర్థి మేకతోటి సుచరిత ఎన్నికల తాయిలంలా మార్చారని విమర్శించారు. స్థానిక సమస్యల పరిష్కారాన్ని వైసిపి పూర్తిగా విస్మరించిందని అన్నారు. బంపర్ మెజార్టీతో గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చుతామనే బిజెపితో ఎందుకు జత కట్టారో వైసిపి,టిడిపి ప్రజలకు చెప్పాలన్నారు. వైసిపి, టిడిపి అవకాశవాద రాజకీయాలను ఎండగట్టాలంటే ఇండియావేదిక, సిపిఎం, సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజయ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో అమరావతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మినేని సురేష్ బాబు, తుళ్లూరు, తాడికొండ,మేడి కొండూరు, ఫిరంగిపురం మండల అధ్యక్షులు బొర్రా రవి చంద్ర,షేక్ లియాఖత్ అలీ,కోటా గోపాల కృష్ణ, విజయ్‌రావు, నాయకులు అడుసుమిల్లి శ్రీనివాస్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాడికొండ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి చిలకా విజయ్ కుమార్

మాట్లాడుతున్న శ్రీనివాసకుమారి

బిజెపిని ఓడిస్తేనే దేశానికి రక్ష

ప్రజాశక్తి-తాడేపల్లి

ముస్లిం మైనార్టీల మనుగడ కొనసాగాలంటే బిజెపి దాని మద్దతుదారులను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు కోరారు. పోలకంపాడులో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బిజెపి గత పది సంవత్సరాల పాలనలో మైనార్టీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. సంక్షేమ పథకాలు నిలిపివేతతో పాటు విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కుదింపు వంటి చర్యలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతం ఆధారంగా పౌరసత్వం పేరుతో ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, సిఎఎ లాంటి ముస్లిం ఉనికికే ప్రమాదకరంగా ఉన్న చట్టాలను తెచ్చిందన్నారు. ఇటువంటి దుర్మార్గమైన చట్టాలను తీసుకొస్తున్న బిజెపికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలపడం దురదృష్టకరమన్నారు. మంగళగిరిలో కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ అద్మీ తదితర 43 పార్టీలు బలపర్చిన ఇండియా వేదిక అభ్యర్థి సిపిఎం నాయకులు జొన్నా శివశంకర్‌ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌కు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డి.విజయ బాబు, వై.శ్రీనివాసరావు, కె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఓటమి ద్వారానే దేశానికి రక్షణ ఉంటుందని సిపిఎం నాయకురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అన్నారు. మంగళవారం రాత్రి తాడేపల్లి కెఎల్‌రావు కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఏ మాత్రం ఉనికి లేని బిజెపికి ప్రధాన పార్టీలు మద్దతు పలకడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇండియా వేదిక అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించడం ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.మేరి, వి.సామ్యేలు, డి.యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణం, రామలింగేశ్వరరావుకు ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

క్రోధి నామసంవత్సర ఉగాదిని పురస్కరించుకుని విజ యశ్రీ సాంస్కృతిక సేవాసంస్థ వారు వివిధ రంగాల్లోని ప్రము ఖులకు ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించింది. విజయవాలోని హనుమంత రాయ గ్రంధాల యంలో జరిగిన ఈ వేడుకలో తాడేపల్లి మండలం ఉండ వల్లి గ్రామానికి చెందిన సినీనటులు, దర్శకులు, త్రినేత్ర ప్రొడ క్షన్స్ అధినేత గాదె నాగ భూషణం, ప్రముఖ సినీ నటుడు, నేషనల్ అవార్డు రచయిత, కవి, దర్శకుడు జొన్నా రామ లింగేశ్వర రావులకు ఉగాది పురస్కారాలను అంద జేశారు. ఈ సందర్భంగా అలిం డియా రేడియో సీనియర్ అనౌన్సర్ ఎ.బి.ఆనంద్, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు బండారు నరసింహారావు, కొప్పుల అశోక్‌ఆనంద్ తదితరులు నాగభూషణం, రామలింగేశ్వరావులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పార్థసారధి, చింతా శ్రీరామ్, దాసరి సాంబశివరావు, వెంకటరెడ్డి, నాని, మోహన్, నరసింహారావు వారికి అభినందనలు తెలిపారు.

గాదె నాగభూషణంకు పురస్కారం

జొన్నా రామలింగేశ్వరరావుకు పురస్కారం

దొరకని గ్రాసం.. పశుపోషణ భారం..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పంట నూర్పిళ్లలో యంత్రాల వినియోగం పెరగడంతో కొన్నేళ్లుగా పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి అధిక ధర చెల్లించి పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోంది. పచ్చిగడ్డి లభ్యత అంతంతమాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పశు పోషకులు వేసవిలో పశువులను తెగనమ్ముకుంటున్నారు. పల్నాడు జిల్లాలో 28 మండలాలుండగా వీటిల్లో 467046 గేదెలు, 66072 ఆవులు ఉన్నాయి. ఇందులో అధిక శాతం పాడి పశువులే కావడంతో పాల ఉత్పత్తితో వచ్చే ఆదాయం కంటే పశుగ్రాసం కొనుగోలుకు ఎక్కువ ఖర్చవుతోందని పాడి రైతులంటున్నారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని చెబుతున్న అధికారులు పశుపోషణకు గడ్డి జాతి పంటలు వేసే దిశగా అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ఎండుగడ్డికి డిమాండ్ ఉండటంతో గుంటూరు జిల్లాలోని పొన్నూరు ప్రాంతాల నుండి ఒక్కో ట్రాక్టర్ వరిగడ్డి (రెండు లేదా రెండున్నర ఎకరాల వరి గడ్డి) రూ.25 వేల వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీన్ని వామి వేసుకోవడానికి మరో రూ.2-3 వేలవుతున్నాయి.

కాడి వదిలి పాడినే నమ్ముకున్న చిన్న సన్నకారు రైతులకు, ఒంటరి మహిళలకు, వ్యవసాయ పనులు చేయలేని వారికి, ఇతర పేదలకు పాడిపరిశ్రమ ప్రధాన జీవనోపాధిగా ఉంది. అయితే వారంతా ఇప్పుడు తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరువు పరిస్థితులతో మేత, నీటి లభ్యత లేక పశువులు అలమటిస్తున్నాయి. పలుచోట్ల చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేకుండా ఇంకిపోయాయి. ఇన్నాళ్లూ తమ కుటుంబానికి జీవనాధారంగా నిలిచిన పశువులకు మేత, నీరు అందించలేని స్థితిలో పాడిరైతులు దిగాలు పడుతున్నారు.

గతంలో టిఎంఆర్ సమీకృత (సైలేజ్) గ్రాసాన్ని రైతులకు రాయితీపై అందించేవారు. కొన్ని నెలలుగా ఆ ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. పశుగ్రాసం కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించిన పశు సంవర్ధక శాఖ అధికారులు అవసరమైన గడ్డి విత్తనాలను రాయితీపై సరఫరా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న క్రమంలో పశుపోషణ

పొన్నూరు చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుండి వరిగడ్డి రవాణా

ప్రాధాన్యతను గుర్తించి స్వల్ప, దీర్ఘకాలిక గడ్డి జాతుల పెంపకానికి పశు సంవర్ధక శాఖ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పాడిరైతుల నుండి వ్యక్తమవుతోంది.

102 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు సరఫరా చేశాం

కె.కాంతారావు, పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

రబీలో గడ్డి విత్తనాల అవసరం గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించడంతో 102 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు సరఫరా చేశారు. వాటన్నింటినీ రైతులకు పంపిణీ చేశాం. ఇంకా అవసరం ఉన్నా ప్రభుత్వానికి నివేదించి వచ్చిన వెంటనే అవసరమైన రైతులకు అందజేస్తాం. కొన్ని పథకాలు ఆగిపోయినా వాటి స్థానంలో కొత్త పథకాలు అమలవుతున్నాయి. సైలేజీ గడ్డి సరఫరా ఆగిపోయినా సమీకృత మిశ్రమ దాణా పథకం అమలు ద్వారా కిలో రూ.6.50కు పంపిణీ చేస్తున్నాం. ఇది పాల దిగుబడికి ఉపయోగ పడుతుంది. అమలులో ఉన్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

భృగుబండ చెన్నకేశవ స్వామి ఆలయంలో మంత్రి రాంబాబు

ఉగాది ప్రత్యేక కార్యక్రమాల్లో నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఉగాది సందర్భంగా మండలంలోని భృగబండ గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని మంత్రి సందర్శించారు. ఏడాదంతా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరి జీవితాల్లో సుఖ, సంతోషాలు వెల్లివిరియాలని అన్నారు. పేదల పక్షాన నిలిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకున్నారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఆర్.పురుషోత్తం ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ

రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్‌లో డిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉగాది వేడుకలకు లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టిడిపి సీనియర్ నాయకులను సత్కరించారు.

ఉగాది వేడుకల్లో పాల్గొన్న బొర్రా వెంకట అప్పారావు

మండలంలోని దూళిపాళ్ల జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రజలందరూ సుఖ, సంతోషాలతో, పాడి, పంటలతో, భోగ భాగ్యలతో జీవనం సాగించాలని కోరుకున్నారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ అత్యధిక మెజారిటీతో గెలవాలన్నారు. జనసేన శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సాంబశివరావు, సత్తెనపల్లి 7వ వార్డు కౌన్సిలర్ ఆర్.సుమన్, జనసేన సత్తెనపల్లి, నకరికల్లు మండలాల అధ్యక్షులు ఎన్.నాగేశ్వరావు, టి.లక్ష్మి శ్రీనివాస్, నాయకులు పూర్ణ, అంకమ్మరావు, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

టిడిపి ద్వారానే వరికపూడిసెల సాధ్యం : ఎంపి

వైసిపిని వీడి టిడిపిలో చేరిన 25 ఎస్టీ కుటుంబాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో వైసిపి నుండి టిడిపిలోకి వలసల జోరు కొనసాగుతోంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలేనికి చెందిన 25 ఎస్టీ కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరందరికీ టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద బాబు టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. అరవిందబాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో కనీసం గ్రామాల్లో రోడ్లకు తట్ట మట్టి పోయలేదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దోచుకోవడం, దాచుకోవడం మినహా అభివృద్ధి లేదన్నారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ టిడిపి ద్వారానే వరికపూడిసెల ఎత్తిపోతల పథకం పూర్తవుతుందని, పల్నాడు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పి.జగ్గయ్య, నాయకులు ఐ.ప్రసాద్, జి.వెంకట్‌రావు, జి.వెంకటేశ్వర్లు, జి.సురేష్, ఎస్.మారుతి, ఐ.వేణు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సంక్షేమ పథకాలు, అభివృద్ధి, వాలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే వైసిపికి ఓటేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రొంపిచర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని మసీదు, చర్చి, దేవాలయాలను ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన సిద్ధం బస్సు యాత్ర రొంపిచర్ల మీదుగా మీదుగా పిడుగురాళ్ల వెళ్తుతుందని నియోజకవర్గంలోని వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిహెచ్.గోపాలరెడ్డి, వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పి.శివారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు పి.చక్రారెడ్డి, జి.చినకోటిరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి జి.బ్రహ్మారెడ్డి, పి.రవీంద్రబాబు, సిహెచ్.సంజీవరెడ్డి, పి.వెంకటరెడ్డి, కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రజల దాహార్తి తీర్చటానికి చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో చలివేంద్రాన్ని ఎఆర్ యూత్ సభ్యులు కె.తిరుపతి, ఎ.రవితేజ, కె. రంజిత్ ఏర్పాటు చేయగా మంగళవారం ప్రారంభించారు. మాజీ ఎంపీపీ జి.బాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వి.అప్పారావు, తెలుగు యువత మండల అధ్యక్షులు జి.శివ పాల్గొన్నారు.

కారంపూడిలో వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కారంపూడి

మండల కేంద్రమైన కారంపూడిలో వైసిపి కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఎంపిపి బొమ్మిన సావిత్రి అల్లయ్య, జెడ్‌పిటిసి షేక్ షఫీ, సర్పంచ్ రామావత్ ప్రమీలబాయి తేజానాయక్, దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొమ్ము చంద్రశేఖర్, పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ జానీబాషా ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. స్థానిక స్టేట్ బ్యాంకు సెంటర్ వద్ద వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ జానీబాషాకు సంబంధించిన ఇంట్లో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశం జరిగింది. రానున్న ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమల

షెడ్యూల్‌పై చర్చించి ప్రకటించారు. నాయకులు పి.రామిరెడ్డి, మిరియాల ఎంపిటిసి కె.ఎర్రగురువారెడ్డి, కె.పిచ్చయ్య, వి.లింగయ్య, నాయకులు బి.నాగేశ్వరరావు, షేక్ మీరా, జి.శ్రీను, ఎస్.అంకారావు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ జిఎంసి క్యాష్ కౌంటర్లు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించిన ఆస్తిపన్నును ముందస్తుగా ఏప్రిల్ 30వ తేదీలోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని, పన్ను చెల్లింపుదారులకు వీలుగా నగరపాలక సంస్థ క్యాష్‌కౌంటర్లు సెలవు రోజుల్లో కూడా పని చేసేలా చర్యలు తీసుకున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పన్నును ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈనెల 30లోపు ఆస్తి పన్నుని ఏకమొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపు కోసం జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు సెలవు రోజుల్లో కూడా పని చేసేలా అదనపు క్యాష్ కౌంటర్లను, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్‌రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్‌కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం రూ.67 లక్షలు పన్ను చెల్లింపు జరిగిందని తెలిపారు. నగరపాలక సంస్థ 2024-25 డిమాండ్ మొత్తం ఆన్‌లైన్‌లో పొందుపరచడమైనదని, కావున ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని ఈ నెలాఖరు లోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కోరారు.

వ్యర్థాలను తొలగించరూ...

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో బోసుబొమ్మ సెంటర్‌లోని ఓ ఇంటిపక్క పెద్దఎత్తున వ్యర్థాలు పోగుపడుతున్నాయని ఇంటి యజమానితో పాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అక్కడ ఉన్న వ్యర్థాలకు నిప్పు రాజుకుని పెద్దఎత్తున మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. దీని వల్ల ఇంటి గోడకు కూడా నష్టం వాటిల్లిందని తెలిపారు. వ్యర్థాలు పోగుపడటం వల్ల విష కీటకాలు ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాయని, వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని వ్యర్థాలు అక్కడ నిలవలేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహాయోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో రాజేశ్వరరావు 30వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్పొరేట్ మతోన్మాద బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా బ్లాక్ వేదిక గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థిగా జంగాల అజయ్ కుమార్ పోటీ చేస్తున్నారని అన్నారు. మంగళగిరి అసెంబ్లీకి సిపిఎం అభ్యర్థిగా జొన్న శివశంకరరావు పోటీ చేస్తున్నారని వారిద్దరిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో సిపిఐ నాయకులు పి నాగేశ్వరరావు, వై వెంకటేశ్వరరావు, సిన్ని సత్యనారాయణ, వి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

ఎస్సీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు

ప్రజాశక్తి - మంగళగిరి

మాదిగలను నమ్మించి మోసం చేసిన వైఎస్ జగన్ కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని మాదిగ సంఘాల జేఏసీ అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగ హెచ్చరించారు. మంగళగిరి నగరంలోని ప్రెస్ క్లబ్ మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికలలో మాదిగలకు సమ న్యాయం పాటించి 15 సీట్లు కేటాయించిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకే మా మాదిగల మద్దతు అని అన్నారు. మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న నారా లోకేష్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి 27 ఎస్సీ పథకాలను రద్దు చేసిన మాదిగలు ఓట్లు ఎందుకు వేయాలో వైయస్ జగన్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టులో మాదిగల తరపున వైసీపీ ప్రభుత్వం ఒక్క లాయర్ను కూడా పెట్టకుండా మాదిగల వ్యతిరేకంగా మారిన వైయస్ జగన్ ఈ ఎన్నికల్లో ఓడించాలని వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. ఎస్సీ లను మాదిగ, మాల, రెల్లి, కార్పొరేషన్లు చేసి ఆ కార్పోరేషన్లకు రూపాయి కూడా చెల్లించకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఈ ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్‌కి ఒక పైసా నిధులు కేటాయించకుండా లిడ్ క్యాప్ ను నిర్వీర్యం చేసిన వైయస్ జగన్‌ను ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో మాదిగ సంఘాల నాయకులు జె ప్రకాష్, కొదమల బెంజిమెన్, పొన్నగంటి రమేష్, వేజెండ్ల సుబ్బారావు, కటివరపు కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

అన్నదానాన్ని ప్రారంభిస్తున్న పండితులు

వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయకీలాద్రిపై ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ స్నానాలతో ఉగాది వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకు శ్రీ సీతారామ చంద్రులకు అభిషేక మహోత్సవం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి నిత్య కళ్యాణ మహోత్సవం, శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్రోధినామ సంవత్సర వసంత నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 17వ తేదీ వరకు జరగనున్నాయని పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

ముక్తినాథ్ వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గుంటూరు ఛానల్ వద్ద ఉన్న ముక్తినాథ్ నగర్లోని ముక్తినాథ్ వృద్ధుల ఆశ్రమంలో ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం ఆశ్రమం నిర్వాహకులు అవ్వారు వెంకటేశ్వర్లు, శ్రీమతి మల్లేశ్వరి దంపతులు వృద్ధులకు అన్నదానం నిర్వహించి, చీరలు పంపిణీ చేశారు. అనంతరం అవ్వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో నారా లోకేష్ 2019లో ఓడిపోయినప్పటికీ నాటి నుండి నియోజక వర్గంలో 29 రకాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు లోకేష్, పార్లమెంటు టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ను గెలిపించాలని కోరారు.

పురోహితులకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉగాది పర్వదినాన్ని పరిష్కరించుకొని స్థానిక భగీరథ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పురోహితులను సత్కరించి, పంచాంగాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉగాది పర్వదినాన ట్రస్ట్ పురోహితులను సత్కరించి పంచాంగాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్య క్రమంలో దేవస్థాన ఈవో జేవీ నారాయణ, వైయస్ఆర్సీపీ నాయకులు నేరేళ్ల మురళి, ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబ శివరావు, పూజారి టి మహేష్, కర్నాటి శివ సత్యనారా యణ, జూట్రు ఏడుకొండలు, రెడ్డి సుబ్బారావు, దుంపల సో, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, ముద్రబోయిన సుబ్బారావు, నంద్యాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.



పురోహితులను సన్మానిస్తున్న భగీరథ ట్రస్ట్ సభ్యులు

తెలుగు సాహితీ సౌరభమ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ప్రజాశక్తి-తెనాలి

క్రోధి నామసంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక పినపాడులో తెలుగు సాహితీ సౌరభమ్ వేదిక ఆధ్వర్యంలో వేదిక అధ్యక్షులు మోదుకూరు రాధాకృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. సాగిన కార్యక్రమంలో టిఎస్ఆర్ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డివిఆర్ ప్రసాద్, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణంలో రాధాకృష్ణ శర్మ

జొన్న నూర్పిడి చేస్తున్న కూలీలు

చేతికొచ్చిన రబీ పంట

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఖరీఫ్‌లో మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న రైతన్నలు రబీ మీద పెట్టుకున్న ఆశలు ఒమ్ము కాలేదు. జల వనరుల శాఖ అధికారులు రబీలో మొక్కజొన్న, జొన్నకు నీరు అందించలేమని చెప్పినప్పటికీ వ్యవసాయక శాఖ వారు భూ సారం తగ్గుతుంది ప్రత్యామ్నాయ పంటలు వేయమని సలహాలు ఇచ్చినప్పటికీ రైతన్నలు మొక్కవోని దీక్షతో రబీలో మొక్కజొన్న, జొన్న సాగు చేపట్టారు. మొక్కజొన్నలు ఇప్పుడిప్పుడే కోతకు వస్తున్నాయి. కానీ జొన్న నూర్పిడిలు జోరుగా సాగుతున్నాయి. తుపాను తర్వాత వర్షం ముఖం చాటినప్పటికీ మండల పరిధిలోని రైతులు బోర్ల మీద ఆధారపడి పంట పండించారు. గత సంవత్సరం దిగుబడికన్నా ఒక్క బస్తా కూడా తగ్గలేదు. జొన్నలు ఎకరాకు 25క్వింటాళ్ల దిగుబడి అవుతున్నాయి. ధర కూడా ఆశాజనకంగానే ఉందని, క్వింటా రూ.2000 పలుకుతుందని రైతులు తెలుపుతున్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ కౌన్సిలర్ శ్రీను

వీవర్స్ కాలనీలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి వీవర్స్ కాలనీ స్కూల్ వద్ద వేసవిని పురస్కరించుకొని స్థానిక గౌరీ శంకర్ జిరాక్స్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మాజీ కౌన్సిలర్ ఉడతా శ్రీను చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైస్కూల్ విద్యార్థులతోపాటు నిత్యం పాదచారులు, వాహన చోదకులతో రద్దీగా ఉండే ఆత్మకూరు రోడ్డులో గౌరీ శంకర్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామనాథం గౌరీ శంకర్, వివిధ రంగాల ప్రముఖులు సుబ్రహ్మణ్యం, బిట్రా రవికుమార్, సింగరేసు కృష్ణ, ఆకురాతి రూపసుందర్, అక్కల నరసింహారావు, తులసి నవీన్, మున్నంగి రామిరెడ్డి, పుసులూరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - దుగ్గిరాల

గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ మరియు స్థానిక ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ సహకారంతో తెనాలి విజయవాడ రహదారి పక్కన గ్యాస్ కంపెనీ వద్ద మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత పది సంవత్సరముల నుండి క్రమం తప్పకుండా వేసవికాలంలో చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. రహదారిపై ప్రయాణించే వారికే కాక స్థానిక ప్రజలకు కూడా చల్లని తాగునీరు, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో దోస్త్ అధ్యక్షులు మిక్కిలిని గాంధీ గద్దె శ్రీనివాస్ గద్దె అనసూర్యవతి గద్దె రవీంద్ర వల్లూరి నరసింహారావు చింతమనేని మహేష్ పర్వం పర్వతనేని హర్ష నక్క చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



అర్చకులతో కలెక్టర్, తదితరులు

అర్చకులు, పండితులకు కలెక్టర్ సత్కారం

ప్రజాశక్తి-గుంటూరు

దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా దేవాదాయ శాఖ గుంటూరు జిల్లా తరపున అర్చకులకు, వేద పండితులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సత్కరించారు. ఫిరంగిపురం వేణుగోపాలస్వామి దేవస్థానం అర్చకులు ఆమంచి వెంకటేశ్వర్లు, పాతగుంటూరు కంచి కామాక్షి ఏకాంబరేశ్వరస్వామి దేవాలయం అర్చకులు ఎస్.మల్లిఖార్జునరావు, కుంచవరం రామలింగేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు ఆమంచి వెంకటేశ్వర్లుకు, వేద పండితులకు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి నూతన వస్త్రాలు, పండ్లు, రూ.10,116లు పారితోషకం, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.అనుపమ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయ స్థానం న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి. యస్.బి.జి.పార్ధసారధిని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మంగళ వారం సాయంత్రం ఐబిలో మర్యాద పూర్వకంగా కలిశారు.



న్యాయమూర్తులతో కలెక్టర్

గౌరీశంకర్‌ను సత్కరిస్తున్న న్యాయవాది శివశంకర్ తదితరులు

హిందూ ఇంజినీరింగ్ కాలేజీలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీ ఏకాదండయ్య పంతులు చారిటీస్ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డు, హిందూ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సమావేశ మందిరంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు జ్యూడీషియల్ ప్రివ్యూ న్యాయమూర్తి శివశంకరరావు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం వందల కోట్ల రూపాయల ఆస్తులను సమాజ హితం కోసం తన వీలునామా ద్వారా బహుముఖ సేవలకు వ్యవస్థీకరించిన దార్శనికుడు ఏకాదండయ్య పంతులు అని ప్రశంసించారు. ప్రముఖ న్యాయవాది, ట్రస్టీ కోటంరాజు శేషచంద్రమౌళీశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సభలో రాళ్లబండి వి.ఎస్.ఆర్.శర్మ ప్రసంగించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ వై.గౌరీశంకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మన్నవ రాధాకష్ణమూర్తి, పి.దత్తప్రసాద్, డాక్టర్ దీవి హరిప్రసాద్, వర్కింగ్ ట్రస్టీ కొండూరి నందకిషోర్, ట్రస్టీలు కే.ఎస్.ఆర్.కుటుంబరావు, భట్రాజు కృష్ణకిషోర్, కేసానుపల్లి వెంకటశ్రీరామ సుబ్బారావు పాల్గొన్నారు

చంద్రబాబును కలిసిన గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి గల్లా మాధవి మంగళవారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధినేత చంద్రబాబును కలిశారు. పుష్పగుచ్చం ఇచ్చి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పంచాగ శ్రవణంలో పాల్గొన్నారు. హాజరు అయిన వారికి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రాబోయే కాలంలో ఎన్‌డిఏకు సానుకూల ఫలితాలు వస్తాయని ఆమె ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. తరువాత స్థానిక గుజ్జనగుండ్ల నాయి బ్రాహ్మణ కాలనీలో జరిగిన నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో మాధవి పాల్గొన్నారు.

భారతీయ భవన్‌లో ఆధునీకరించిన ఆడిటోరియం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్రానికి పూర్వం భారతీయ సాంస్కృతిక, విద్యా మూలాల పునర్జీవం కోసం డాక్టర్ కే.ఎం. మున్షి దేశవ్యాప్తంగా ఏర్పాటుచేసిన భారతీయ విద్యా భవన్‌లలో ఒకటైన గుంటూరు భారతీయ విద్యా భవన్ సమావేశ మందిరం పునర్నిర్మాణం చేయించిన బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి దాతత్వం, శ్లాఘనీయం అని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో పునర్నిర్మాణం చేసిన బొమ్మిడాల ఆడిటోరియంను అతిథులతో కలిసి జస్టిస్ కృష్ణమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో జస్టిస్ మాట్లాడుతూ నేటి విద్యా సంస్థలు వస్తువులు ఉత్పత్తి చేసే ఉత్పత్తి కారకాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి భవిష్యత్తును నిర్మించుకునే విద్యార్థులకు విలువలతో కూడిన సామాజిక పునాదులు పాఠశాలల నుండే వేయాలని చెప్పారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పెనుమత్స రామచంద్రరాజు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా విలువలతో కూడిన విద్యాబోధన అందిస్తూ భావి పౌరులను తీర్చిదిద్దు తున్నట్లు తెలియజేశారు. బొమ్మిడాల ఫౌండేషన్ చైర్మన్ శ్రీకృష్ణ మూర్తి మాట్లాడుతూ ఆధునీకరిచంటం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్.వి. ఎస్.లక్ష్మీనారాయణ, భారతీయ విద్యా భవన్ నేషనల్ జాయింట్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ జగదీష్ లఖాని, కోశాధికారి మాజేటిప్రసాద్, యువ అవధాని ఉప్పలదడియం భరత్ శర్మ, రొటేరియన్ వడ్లమాని రవి, పాఠశాల ప్రిన్సిపాల్ నూకల హేమాంబ, నగర ప్రముఖులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

14న మంగళగిరిలో సిఎఎపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి మంగళగిరి

సిఏఏ పై 14వ తేదీన మంగళగిరి పట్టణం టిప్పర్ల బజార్‌లోని అంజుమన్ షాదీఖానాలో ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు జరుగుతుందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి తెలిపారు. మంగళవారం మంగళగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ రక్షణ, లౌకికవాద పరిరక్షణ కొరకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బిజెపి గత పది సంవత్సరాలు పాలనలో మైనార్టీలకు బడ్జెట్లో కేటాయింపులలో కోత, పథకాల నిలిపివేత, ఉపకారవేతనాల కుదింపు వంటి ఆర్థిక దాడులే కాకుండా సామాజికంగా అజాన్, హలాల్, నమాజ్, ఇజాబ్, లవ్ జిహాద్, గర్ వాపసి, యుసిసి, ఆర్టికల్ 370, గోహత్యలు అంటూ దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఎంపిజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ ప్రమాదకరమైన మతం ఆధారంగా పౌరసత్వం అంటూ 2019 సంవత్సరంలో ఎన్ఆర్‌సి, ఎన్.పి.ఆర్, సిఏఏ లాంటి ముస్లింల ఉనికే ప్రశ్నార్ధకంగా మారే చట్టాలను తెచ్చిందని అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో మార్చి 11వ తేదీన సిఏఏ విధి విధానాలు రూపొందిస్తూ వాటి అమలు కొరకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని అన్నారు. 14వ తేదీన జరిగే సదస్సుకు ప్రజాతంత్ర వాదులు, లౌకికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో ఎమ్మెల్సీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ కెఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఆవాజ్ కమిటీ మంగళగిరి టౌన్ కన్వీనర్ షేక్ జానీ భాష పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నాసిరకం మద్యంతో ప్రజలకు అనారోగ్యం

టిడిపి గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం విక్రయిస్తున్న నాసిరకం మద్యం తాగి నిత్యం వేలాది మంది అనారోగ్యం బారినపడుతున్నా సిఎం జగన్‌కు ఏమాత్రం స్పందన రావడం లేదని టిడిపిగుంటూరు లోక్ సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పొన్నూరు నియోజకవర్గం అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి పెదకాకాని మండలంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా తక్కెళ్ళపాడు, వెంకట కృష్ణాపురం, గోళ్లమూడి, ఉప్పలపాడు, నంబూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. దారి పొడవునా ఇరువురు నాయకులను పూల వర్షంలో ముంచెత్తారు. నంబూరులో జరిగిన ముగింపు ప్రజాసభలో పెమ్మసాన్ని మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో చెట్లు నరికిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది జగన్ మాత్రమే అన్నారు. ఒక సీఎంగా ఉండి గంజాయిని కూడా అరికట్టలేవా అని జగన్‌ను ప్రశ్నించారు. అవినీతి అధికారులు, నాయకులు చేసిన అవినీతి పనుల వలన గుంటూరు కార్పోరేషన్ పరిధిలో నీటి సమస్య తలెత్తిందని, ఎన్నికలు పూర్తి కాగానే ఒక్కొక్కరి భాగోతం బయటపెడతాను, నీటి సమస్య పరిష్కరిస్తానన్నారధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ నంబూ రులో కార్యకర్తల ఉత్సాహం చూస్తే వైసిపి నాయకులకు మరిగిపోతూ ఉంటుందేమోనని అన్నారు. 2014-19 మధ్యలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే నంబూరుకి కనెక్టివిటీ హైవే, గొల్లగూడెం రోడ్డు, నంబూరు నుంచి ఎటువైపు వెళ్ళాలన్నా రోడ్లు వేసింది కూడా టిడిపినే అన్నారు. గుంటూరు ఛానల్ పై డబుల్ వంతెన, మసీదులు నిర్మించినా, జీతాలు ఇచ్చినా, దుల్హన్ పథకం ఇచ్చినా అది టిడిపి ఆధ్వర్యంలోనే జరిగిందని వివరించారు. నంబూరు నడిబొడ్డున నిలబడి తామిచ్చిన పెన్షన్లు, వేసిన రోడ్లు, అభివృద్ధి పై సవివరంగా స్పష్టం చేయగలమని ఆయన వివరించారు. పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రానం మార్కండేయులు, పెదకాకాని మండల జనసేన అధ్యక్షుడు వెంకటరావు, టిడిపి రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి మోసిఫ్, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, టిడిపి నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్ తదితర టిడిపి బిజెపి జనసేన నాయకులు యావత్ పర్యటనలో పాల్గొన్నారు.

ఉప్పలపాడులో ప్రచారం నిర్వహిస్తున్న దూళిపాళ్ల, పెమ్మసాని

రాష్ట్రాభివృద్ధికి అమరావతి దోహదం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్రాభివృద్ధికి అమరావతి రాజధాని నిర్మాణం దోహదపడుతుందని రైతులు, రైతు కూలీలు, మహిళ లు అన్నారు. రానున్న ఎన్నికలలో అమరావతి ఏకైక రాజధాని మద్దతు దారులనే గెలిపించుకుందామన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న దీక్షలు మంగళవారంతో 1575 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, వెంకటపాలెం, నెక్క ల్లు, అనంతవరం, మందడం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్, ఒకే రాష్ట్రం,ఒకే రాజధానంటూ నినాదాలు చేశారు.



తుళ్లూరు లో రైతుల ఆందోళన